అన్నదాతకు 'తుపాన్' దెబ్బ!

- వర్షాలతో దెబ్బతింటున్న పంటలు
- చేజారిన చేతికొచ్చిన ఉల్లి
- పూత రాలుతున్న కంది
- ఆందోళన చెందుతున్న రైతులు

కోడుమూరు రూరల్ : అన్నదాతను వర్షాభావ పరిస్థితులు వెంటాడుతూనే ఉన్నాయి. బంగాళాఖాతంతో ఏర్పడిన అల్పపీడన ప్రభావం రైతులపై పడింది. తుపాన్ రూపంలో రైతులను దెబ్బతీస్తుంది. మూడురోజులుగా కురుస్తున్న జల్లులవానతో ఉల్లి, కంది రైతులు నిండా మునిగారు. ఉల్లి, కంది పంటలు దెబ్బతింటుండడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన ఉల్లి పంట కుళ్లి పోతుంది. పంటను పీకలేరు, గడ్డను కోయలేరు అన్నట్లుగా ఉంది ఉల్లిరైతు దుస్థితి. ఇక కంది పంట పూత రాలుతుండడంతో రైతన్నలకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. వర్షాధారం, బోర్ల కింద సాగు చేసిన ఉల్లి పంటను చాలాచోట్ల రైతులు పీకి కోతలకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వలన దిగుబడులను మార్కెట్‌కు తరలించలేని పరిస్థితి. దిగుబడులను పొలాల్లోనే పెట్టుకుని తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పంట కళ్లముందరే దెబ్బతింటుండడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

విస్తారంగా ఉల్లి సాగు...


జిల్లాలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, దేవనకొండ, ఆలూరు, ఆస్పరి, మద్దికెర, కోసిగి, తుగ్గలి ప్రాంతాల్లో బోరు బావులతో పాటు, వర్షాధారం కింద దాదాపు 46వేల ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు రైతులు. ప్రస్తుతం ఉల్లి పంట చేతికి రావడంతో కోతలకు సిద్ధమవుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో ఇప్పటికే కోసి ఉల్లి దిగుబడులను ఆరబెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో తుపాన్ రైతులను ఇబ్బంది పెడుతోంది. వర్షాలు కురుస్తుండడంతో చేతికొచ్చిన పంట నోటికి అందకుండా పోతుందని రైతు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం అధికంగా ఉంటే ఉల్లి పంటకు సరియైన ధర రాదు. ఉల్లి దిగుబడులు ఆరబెట్టుకునేందుకు తుపాన్ మూలంగా అవకాశం లేకపోయింది. దీంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది.



పూడూరులో ఉల్లి పంటను కోయలేక పొలాల్లోనే వదిలేసిన దృశ్యం

పూర్తిగా మునిగిన వెంకటగిరి ఉల్లి రైతులు

ఉల్లి సాగుకు పేరొందిన గ్రామం కోడుమూరు మండల పరిధిలోని వెంకటగిరి. జిల్లాలోనే ఈ గ్రామ రైతులు అత్యధికంగా ఉల్లి సాగు చేస్తారు. దాదాపు 90 శాతం రైతులు ఉల్లి సాగు చేస్తున్న పరిస్థితి. ఈ యేడు వెంకటగిరిలోనే రెండవేల ఎకరాలకుపైగా ఉల్లి సాగు చేశారు. ఏకంగా పది ఎకరాల్లో సాగు చేసిన రైతులు ఉన్నారు. ఉల్లి చేతకొచ్చిన తరుణంలో తుపాన్ దెబ్బకొట్టింది. ఉల్లిరైతులను నిండా ముంచేసింది తుపాన్. దీంతో ఉల్లి రైతులు దిగాలుగా ఆకాశంవైపు చూస్తున్నారు.



వెంకటగిరిలో ఉల్లి దిగుబడులను పొలంలోనే వదిలేసిన దృశ్యం



కోసిన ఉల్లిని టార్పాలిన్లతో కప్పిన రైతులు

ఏమి చేయాలో అర్థం కావడం లేదు



సొంత పొలం నాలుగెకరాలతో పాటు, పది ఎకరాలను గుత్తకు తీసుకుని ఉల్లి, కంది పంటలు సాగు చేశా. ఆరున్నర లక్షలకు పైగా పెట్టుబడి ఖర్చు అయ్యింది. పదెకరాల్లో ఉల్లి పంట చేతికి రావడంతో నాలుగురోజుల కిందట పీకి పెట్టా. వానలు కురుస్తుండడంతో ఉల్లిగడ్డలను కోసుకోలేని పరిస్థితి. ఇలాగే వానలు పడితే ఉల్లిగడ్డలు దెబ్బతినే ప్రమాదం ఉంది. కంది పంట కూడా పూత మీద ఉంది. వానల వలన పూతరాలిపోతుంది. తుపాను నష్టం చేకూర్చుతోంది. ఏమి చేయాలో పాలుపోవడం లేదు.

– రైతు శివ, వెంకటగిరి, కోడుమూరు మండలం

కోతలు వాయిదా వేసుకోండి



తుపాన్ ప్రభావంతో వానలు పడుతున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలి. ప్రత్యేకించి ఉల్లి రైతులు జాగ్రత్తలు పాటించాలి. కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో ఐదువేల ఎకరాలకుపైగా ఉల్లి సాగు అయ్యింది. ఉల్లి కోతకు వచ్చినప్పటికీ వాయిదా వేసుకోవాలి. ఉల్లి పైరులో నీటి నిల్వ లేకుండా చూసుకుంటే దిగుబడులను కాపాడుకోవచ్చు.

– మధన్ మోహన్, హార్టికల్చర్ ఆఫీసర్, కోడుమూరు

తుపాన్‌తో ఇక్కట్లు



తమ్మరాజుపల్లెలో ధాన్యంపై పట్టలు కప్పిన దృశ్యం

పాణ్యం: తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండురోజులుగా కరుస్తున్న వర్షాలకు ఇక్కట్లు తప్పడం లేదు. మంగళవారం సాయంత్రం నుంచి మొదలైన వర్షం బుధవారం మధ్యాహ్నం వరకు సాగింది. ఉదయం 7 నుంచి 11 గంటలకు భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అదేవిధంగా పంటలు దెబ్బతిన్నాయి. తమ్మరాజుపల్లెలో ఆరబెట్టుకున్న మొక్కజొన్న దిగుబడులను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు రైతులు. టార్పాలిన్ పట్టలను కప్పి ధాన్యాన్ని కాపాడుకున్నారు. పాణ్యంలో ఓ మట్టిమిద్దె కూలిపోయినట్లు ఆర్ఐ రామచంద్ర తెలిపారు. చాలా ఇళ్లలోకి నీరు చేరడంతో ఆయా కుటుంబాలు ఇబ్బందులు పడ్డాయి. కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలకు సైతం అంతరాయం ఏర్పడింది. వర్షం తగ్గిన తర్వాత యథావిధిగా పూజలు నిర్వహించారు. ఇటీవల నాటిన పొగాకునారు వర్షపునీటి మూలంగా దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



గోనవరంలో పొలంలో నిలిచిన వర్షపునీరు

క్లుప్తంగా

పర్ల గ్రామంలో పొలం పిలుస్తోంది



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ శ్రీనివాసరెడ్డి

కల్లూరు: మండల పరిధిలోని పర్ల గ్రామంలో బుధవారం ఏఓ శ్రీనివాసరెడ్డి పొలం పిలుస్తోందని కార్యక్రమం నిర్వహించారు. సాగులో పాటించాల్సిన ఆధునాత వ్యవసాయ పద్ధతులను రైతులకు ఏఓ వివరించారు. అనంతరం రైతులకు రాయితీ పప్పు శనగ విత్తనాలు పంపిణీ చేశారు. విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ సూచించారు.

ఘనంగా దస్తగిరి స్వామి ఉరుసు



కిస్తీలు నిర్వహిస్తున్న భక్తులు

కల్లూరు: మండల పరిధిలోని తడకనపల్లె గ్రామంలో వెలసిన శ్రీ హజరత్ మహబూబ్ సుభానీ (దస్తగిరి స్వామి) ఉరుసు సందర్భంగా బుధవారం కిస్తీలు నిర్వహించారు. గ్రామ ప్రజలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పీఠాధిపతి మౌలాలి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీడీఓ రఘునాథ్

కర్నూలు (రూరల్) : పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం గ్రామాల్లో అభివృద్ధి పనులకు అధికారులు, ప్రజాప్రతినిధులు భూమి పూజ చేశారు. మండల పరిధిలోని పి.రుద్రవరం, గార్గేయపురం, పూడూరు, పడిదెంపాడు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు ఎంపీడీఓ రఘునాథ్, ఈఓఆర్డీ అనురాధ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు.


సమస్యల పరిష్కారానికి కృషి



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కోడుమూరు రూరల్ : గ్రామాల్లో నెలకొన్న ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తెలిపారు. బుధవారం గూడూరులో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అంతకుముందు మండలంలోని గుడిపాడు, చనుగొండ్ల, గూడూరులలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొని పలు అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈఈ కర్రెన్న, తహసీల్దార్ రామాంజినేయులు, ఎంపీడీఓ శివనాగ ప్రసాద్, కమిషనర్ నాగరాజు, ఏఈ జయన్న, ఆయా గ్రామాల సర్పంచులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ సుధాకర్

ఓర్వకల్లు: పొగాకు పైరును ఆశించిన తెగుళ్ల నివారణకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని ఏఓ సుధాకర్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లె, శకునాల గ్రామాలలో రైతులతో ఏఓ సమావేశమయ్యారు. అనంతరం పంట పొలాలను పరిశీలించిన ఏఓ సాగు పద్ధతులను రైతులకు వివరించారు. పొగాకును అక్కడక్కడ ఆకుముడత తెగులు ఆశించిందని, నివారణకు జిగురు అట్టలను అమర్చుకోవాలని సూచించారు. అలాగే థయోమిథక్సమ్ 2 గ్రాములు లేదా, ఎపిసేట్ 2.5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ మధు, రైతు సేవా కేంద్రం సిబ్బంది నగేష్, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో అధిక లాభాలు

కోడుమూరు రూరల్ : కూరగాయల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఆత్మ పీడీ శ్రీరత్నకుమార్ సూచించారు. మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో కూరగాయల సాగుపై 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ఏఓ రవిప్రకాష్, హెచ్‌ఓ మధన్‌మోహన్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీడీ శ్రీరత్నకుమార్ ఆత్మ ఆధ్వర్యంలో సాగవుతున్న కొత్త వంగడాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్యాలకుర్తిలో పండ్లు, కూరగాయల తోటలను ఎక్కువమంది సాగు చేస్తున్నారని, మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఏఓ రవి ప్రకాష్ మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కిశోర్‌కుమార్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కూరగాయపంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న పీడీ శ్రీరత్నకుమార్

నదీతీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్: తుంగభద్ర నదితీర గ్రామాల ప్రజలు, రైతులు వరద ప్రవాహంపై అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని గుండ్రవుల గ్రామంలోని పుష్కర ఘాట్, కొత్తకోట సమీపాన నది నీటి ప్రవాహాన్ని తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోస్పేట్ డ్యామ్ నుంచి దిగువకు వరదనీటిని వదిలారన్నారు. నదికి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చే అవకాశం ఉందని, తిమ్మందొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, ముడుమాల, ఈర్లదిన్నె, కె.సింగవరం, కొత్తకోట గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రైతులు వ్యవసాయ మోటార్లు, పైపులైన్లను మార్చుకునేప్పుడు జాగ్రత్తలు పాటించాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం పాల్గొన్నారు.



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

సీసీరోడ్ల నిర్మాణాలకు భూమి పూజ



పోలకల్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ మాదక్క



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఈఓఆర్డీ నాగేష్

సి.బెళగల్: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం పోలకల్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు సర్పంచ్ మాదక్కతో కలిసి ఎంపీపీ బొంతల మునెప్ప భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ వెంకటప్రకాష్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి, ఏపీఓ రామన్న, ఉపాధి హామీ జేఈ రంగస్వామి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి,కరిమద్దెల గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన పనులకు బుధవారం అధికారులు ప్రజాప్రతినిధులు భూమిపూజల చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ వాసుదేవ గుప్త, తహసీల్దార్ వెంకటరమణ, ఏపీఓ వెంకటరమణ, ఏఈలు భాస్కర్, మూర్తి, పవన్ తదితరలు పాల్గొన్నారు.

కల్లూరు: పల్లెపండగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం తడకనపల్లె గ్రామంలో ఈఓఆర్డీ నాగేష్, సర్పంచ్ సాహెరాబీ సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఏపీఓ మద్దేశ్వరమ్మ, గ్రామ ఐక్య సంఘం అధ్యక్షురాలు జుబేదాబీ, తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

కోడుమూరు రూరల్ : గోనెగండ్ల మండలం కుర్నూరు గ్రామానికి చెందిన రెండు వర్గాలు బుధవారం రాత్రి కోడుమూరు ఆర్‌టీసీ బస్టాండ్ ఎదుట ఘర్షణ పడ్డారు. అప్పు చెల్లించే విషయంలో ఇద్దరు వ్యక్తుల మధ్య మాటమాట పెరిగి రెండు సామాజిక వర్గాల వ్యక్తుల మధ్య గొడవకు దారితీసింది. ఇరు వర్గాలకు చెందిన వ్యక్తులు ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఒక వ్యక్తికి రక్త గాయాలయ్యాయి. కోడుమూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను స్టేషన్‌కు తరలించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు (టౌన్): తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని ఒత్తిళ్లు రావడంతో వ్యక్తి బలవన్మరణం చెందాడు. వివరాలు.. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పందిపాడు గ్రామంలో యూసుఫ్ పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య జిలేకా, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ అవసరాల కోసం రూ.4 లక్షలు అప్పు చేశాడు. సరైన సమయంలో తిరిగి చెల్లించకపోవడంతో అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. ఈ స్థితిలో బుధవారం ఉదయం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమీప బంధువును చూసేందుకు భార్య పిల్లలతో కలిసి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో యూసుఫ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

గార్గేయపురంలో మలేరియా

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలో మలేరియా పాజిటివ్ కేసు నిర్ధారణ అయ్యింది. బ్రాహ్మణ కాలనీలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి మలేరియా బారిన పడ్డాడు. దీంతో బుధవారం జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్, సబ్ యూనిట్ అధికారి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఆ కాలనీవాసులు 200 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. వ్యాధి నిర్ధారణ అయిన వ్యక్తి గృహం ఇరుగు, పొరుగు ప్రాంతాల్లో ద్రవాణాన్ని స్ప్రే చేయించారు. డ్రైనేజీ కాలువల్లో పారిశుద్ధ్య కార్మికులతో డీడీటీ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. అనంతరం కాలనీలో మలేరియా వ్యాధి నిర్మూలన చర్యలపై ప్రజలకు అవగహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ వేణుగోపాల్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ పురుషోత్తం, నర్సులు రాజకుమారి, రాధ తదితరులు పాల్గొన్నారు.

చౌడమ్మా.. చల్లంగా దీవించమ్మా!

- ఘనంగా చౌడేశ్వరీమాత జయంతి
- అమ్మవారిని దర్శించుకున్న రాజకీయ ప్రముఖులు

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లులో వెలసిన చౌడేశ్వరీ మాత జయంతి వేడుకల సందర్భంగా బుధవారం భక్తులతో ఆలయం కిటకిటలాడింది. తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. చౌడమ్మా..చల్లంగా దీవించమ్మా అంటూ వేడుకున్నారు. ఉదయం ఆలయ పూజారీ రామకృష్ణ అమ్మవారికి అభిషేకాది పూజలు సమర్పించి నూతన పట్టు వస్త్రాలతో ముస్తాబు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం, అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం విశిష్ట పూజల మధ్య భక్తులు అమ్మవారికి మహానైవేద్యాలు సమర్పించారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ విజయ మనోహరి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, మాజీ సర్పంచ్ నాగేశ్వరమ్మ, చెన్నకేశవస్వామి ఆలయ మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ తోట కృష్ణారెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, స్వామిరెడ్డి, శంకర్‌రెడ్డి, నాగలింగేశ్వరరెడ్డి, పాల సుబ్బారెడ్డి, వెంకటరమణారెడ్డి, తోట చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. మేళతాళాలతో వెళ్లి అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డి, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, మండల కన్వీనర్ గోవింద రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం తెల్లవారు జాము నుంచి జ్యోతుల మహోత్సవం సాగనున్నట్లు పూజారులు తెలిపారు.



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న కాటసాని ఉమామహేశ్వరమ్మ, విజయమనోహరి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయని స్థానికులు బుధవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులు నెల్లూరులోని దర్గాలో ప్రార్థనలు చేసి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తమ్మరాజుపల్లె వద్దకు రాగానే కారు ముందు వెళ్తున్న ఓ మినీట్రాలీ ముందు టిప్పర్ రాంగ్‌రూట్‌లో రావడంతో డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేశారు. దీంతో కారు మినీట్రాలీని ఢీకొంది. కారులో ఉన్న ఇద్దరికి గాయాలైనట్లు తెలిపారు.

డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు జే.రంగలక్ష్మీదేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ ఇచ్చేందుకు ఆయా శిక్షణా సంస్థలు ఎంపానల్ చేసేందుకు కావాల్సిన వివరాలతో కూడిన ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓ.) (ఈసీఐ డాక్యుమెంట్ నంబర్ 757795) 22 ఏపీ ఈ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ (https://tender.approcurement.gov.in)లో అప్‌లోడ్ చేయడం జరిగిందని తెలిపారు. ఆసక్తి కలిగిన శిక్షణా సంస్థలు ఇతర వివరాల కోసం ఈడీఐ డాక్యుమెంట్‌ను ఏపీ ఈ ప్రొక్యూర్‌మెంట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఈ నెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జేడీ కోరారు. శిక్షణా సంస్థలు కచ్చితంగా డీఎస్‌కే (డిజిటల్ సిగ్నేచర్ కీ) కలిగి ఉండాలని పేర్కొన్నారు.



నడవడానికి వీలులేనంతా బురదమయమైన మహాలక్ష్మినగర్ రోడ్డు



గుంతలుపడిన దిన్నెదేవరపాడు రోడ్డు

చినుకు పడితే చిత్తడే !

కల్లూరు: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల మూలంగా రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. కల్లూరు అర్బన్ వార్డుల్లో పలు కాలనీలు చిత్తడి చిత్తడిగా మారాయి. కాలనీల్లో రోడ్లపై వర్షం నీరుచేరడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కల్లూరు అర్బన్‌లోని మహాలక్ష్మినగర్, పార్థసారథి నగర్, ఎఫ్‌సీఐ కాలనీ-2 తదితర కాలనీలో మట్టి రోడ్లు బురదమయంగా మారయి. కాలుతీసి కాలుపెట్టలేని పరిస్థితి నెలకొంది. బురద ఎక్కువకావడంతో వాహనచోదుకు పడరానిపాట్లు పడ్డారు. అలాగే లక్ష్మీపురం, దొడ్డిపాడు గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారాయి. గుంతలో వర్షపునీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్లకు కనీసం మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.